క్లుప్తంగా

కోవిడ్ నివారణకు చర్యలు



కోవిడ్ రోగుల కోసం బాడంగి సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన బెడ్లు

బాడంగి: దేశంలో కరోనా పాజిటివ్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్యశాఖను రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. కోవిడ్ నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు స్థానిక సీహెచ్‌సీలో ప్రత్యేకంగా కోవిడ్ వార్డు ఏర్పాటు చేశారు. మంగళవారం ఆ వార్డును పరిశీలించిన సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ రాజారమేష్ అక్కడి ఏర్పాట్లపై ఆరాతీశారు. రోగులకు సరిపడ బెడ్లు, ఆక్సిజన్ సిలిండర్లు, మందులు సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రికి వచ్చే వారంతా మాస్క్ ధరించడంతో పాటు భౌతికదూరం పాటించేలా, శానిటైజర్ వినియోగించేలా చూడాలన్నారు.

యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత



విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న యోగా గురువు రామకృష్ణ

రేగిడి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని యోగా గురువులు రామకృష్ణ, శైలజ అన్నారు. మంగళవారం మండలంలోని ఖండ్యాం గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పలు యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిరోజూ ఈ యోగాసనాలు చేయడం ద్వారా ఆరోగ్యం, ప్రశాంతత చేకూరుతుందన్నారు. విద్యార్థులతో చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సేవా సంఘం ఎన్నిక



ముత్యాలరావు, శ్రీనివాసరావును సన్మానిస్తున్న సంఘ సభ్యులు

వంగర: మండల పరిధిలోని మద్దువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు ఆవరణలో మంగళవారం జరిగిన గ్రామీణ వైద్యుల సేవా సంఘం మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా ఎస్.రాజారావు, ఉపాధ్యక్షుడిగా కనకలింగం, సెక్రటరీగా కె.సత్యనారాయణ ఎన్నికయ్యారు. అనంతరం అంతకు ముందు సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేసిన ఉగిరి ముత్యాలరావు, చౌదరి శ్రీనివాసరావులను నూతన సభ్యులు సన్మానించారు.

ఘనంగా సిరిమానోత్సవం



సిరిమానుపై ఊరేగుతున్న పూజారి తవుడు

బొబ్బిలి: పురటాలమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కోమటిపల్లి గ్రామంలో సిరిమానోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూజారి బిడ్డిక తవుడు అధిరోహించిన సిరిమానును ఊరేగించారు. భక్తులు సిరిమానోత్సవం కనులారా తిలకించి, అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు



చింతలపేటలో తాగునీటి బోరు ఏర్పాటుకు బోర్‌వెల్ తీస్తున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని చింతలపేటలో తాగునీటి బోరు ఏర్పాటుకు మంగళవారం బోర్‌వెల్ తీశారు. వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు మండల పరిషత్ నిధులతో ఈ బోరు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంతోష్‌కుమార్ తెలిపారు. యుద్ధప్రాతిపదికన బోరు పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకువస్తామని గ్రామపెద్దలు తెలిపారు.

జగనన్నే రాష్ట్ర భవిష్యత్

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం ప్రభుత్వ పాలన, పథకాలపై ప్రజాభిప్రాయం సేకరిస్తూ జగనన్నే మన భవిష్యత్, రాష్ట్ర భవిష్యత్ అని ఇళ్ల గోడలపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు.

– సాక్షి నెట్‌వర్క్



రేగిడి: మునకవలసలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు చూపిస్తున్న గ్రామస్తులు



రామభద్రపురం: మిర్తివలసలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి



బాడంగి: ఆనవరంలో వైఎస్సార్ సీపీ అభిమానుల ప్రచారం



సంతకవిటి: గరికిపాడులో ప్రభుత్వ పథకాలపై అభిప్రాయం సేకరిస్తున్న గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు



రాజాం సిటీ: లక్ష్మీపురంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న గృహసారథులు



రాజాం: అంతకాపల్లిలో జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్‌కు నమస్కరిస్తున్న వృద్ధులు



వంగర: ఇంటింటికీ వెళ్లి, పథకాలు వివరిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



బొబ్బిలి: జగన్నాథపురం పొలాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై ప్రచారంలో సర్పంచ్ పద్మాసత్యనారాయణ



తెర్లాం: కుసుమూరులో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ సందడి

ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు

- గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం సిటీ:

ప్రతీ ఒక్కరి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని డోలపేటలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వారికి స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఏళ్ల తరబడి నెలకొన్న భూ సమస్యలను ఆయా నేతల దృష్టికి తీసుకువచ్చారు. తమ తాత తండ్రుల నుంచి సాగులో ఉన్న భూమి అప్పట్లో తప్పుడు సర్వే నంబర్ల కారణంగా ఇప్పుడు దేవదాయ భూమిగా చూపిస్తోందని, దానిని సవరించి న్యాయం చేయాలని కోరారు. అలాగే ఎస్సీ కాలనీ, శ్మశానవాటికలో సరైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి నేతలు హామీ ఇచ్చారు. వారు మాట్లాడుతూ సీఎం జగనన్న తన పాదయాత్ర మొదలుకుని, ప్రజాసంకల్ప యాత్ర వరకు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారన్నారు. ఎన్నికల హామీలను కూడా నెరవేర్చారని, ఇప్పటివరకు 98 శాతం హామీలు నెరవేర్చి, రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమ పాలన ఒక్క జగనన్నతోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చి, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్, రాజాం రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



డోలపేటలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు

అన్ని వర్గాల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం



గొల్లపల్లిలో గడప గడపకూ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని గొల్లపల్లి పదో వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ అనేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆయన తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థకు దేశవ్యాప్తంగా మంచి పేరుందన్నారు. గతంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని నేతలు, అధికారుల కాళ్లచుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు.

ఇప్పుడు అలా లేదన్నారు. గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అదిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క సంక్షేమ పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

బాడంగి:

బొబ్బిలి పట్టణంలోని రవీంద్రభారతి ఆడిటోరియంలో బుధవారం దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ అక్కారావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. దివ్యాంగులంతా సంబంధిత ధ్రువపత్రాలతో వచ్చి, ఉపకరణాలు తీసుకోవాలని కోరారు.

13న రాజాంలో..

సంతకవిటి: స్థానిక పట్టణంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో ఈ నెల 13వ తేదీన దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో దివ్యాంగులంతా పాల్గొని, వైద్య తనిఖీలు చేయించుకుని, ఉపకరణాలు పొందాలని కోరారు.

ఎంఈఓ సందర్శన



ఆమదాలవలస కాలనీ పాఠశాల సందర్శనలో ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి:

మండలంలోని ఆమదాలవలస, ఆమదాలవలస కాలనీ, రేగిడి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తరగతుల వారీగా అక్కడి విద్యార్థులకు వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నలు అడిగి వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. ఆమదాలవలస కాలనీ పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులందరూ బాగా చదువుకుని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలో ఫేర్‌వెల్ డే నిర్వహించినందుకు గాను హెచ్‌ఎం విజయమ్మను అభినందించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ఎమ్ కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు



రామభద్రపురంలో ఉపాధి పనులకు ఉత్సాహంగా వెళ్తున్న వేతనదారులు

తెర్లాం: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎస్.బూర్జవలస గ్రామంలో జరుగుతున్న పనులను ఏపీఓ జగదీశ్వరరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం వేతనదారులకు పలు సూచనలు చేశారు. రోజూ రెండు పూటలా నిర్దేశిత కొలతల్లో పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందన్నారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని, వేతనదారులు వడదెబ్బ బారినపడకుండా తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. పని ప్రదేశంలో టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్ ఉంచుకోవాలన్నారు.

రోజుకు రూ.272..

రామభద్రపురం: వలసల నివారణే ధ్యేయంగా ప్రారంభించిన ఉపాధి హామీ పథకం వేతనదారులకు వరంగా మారింది. వేసవిలో వ్యవసాయ పనులు ఉండకపోవడంతో అందరూ గ్రామాల్లో జరిగే ఉపాధి పనులకు ఎంతో ఉత్సాహంగా వెళ్తున్నారు. పని దినాల సంఖ్య పెంచడంతో పాటు రోజువారీ వేతనం కూడా రూ.257 నుంచి రూ.272 పెంచుతున్నట్లు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో వేతనదారుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. దాదాపు ఏడు వేల మంది వేతనదారులు మండలంలోని పలు ప్రాంతాల్లో జరగుతున్న ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రాజాం: మండలంలోని కంచరాం, శ్యాంపురం, రాజయ్యపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ లక్ష్మీపతిరాజు మంగళవారం పరిశీలించి, వేసవిని దృష్టిలో ఉంచుకుని, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అంతకుముందు వేతనదారుల మస్తర్లు పరిశీలించి, పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శంకరరావు, ఏపీఓ సాయిరాం పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురం గ్రామం ఉపాధి హామీ పనులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. గతంలో గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో గుర్తించిన పనుల ప్రకారం ఈ ఉపాధి పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ బొద్దల పద్మాసత్యనారాయణ తెలిపారు.



రాజాం: వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీడీ లక్ష్మీపతిరాజు



తెర్లాం: ఎస్.బూర్జవలసలో జరుగుతున్న ఉపాధి పనులు

రైతుల సమక్షంలోనే హద్దురాళ్ల ఏర్పాటు

తెర్లాం: భూముల రీసర్వేలో భాగంగా చేపడుతున్న హద్దురాళ్ల ఏర్పాటు రైతుల సమక్షంలోనే జరగాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ సూచించారు. మండలంలోని వెలగవలస గ్రామంలో జరుగుతున్న హద్దురాళ్ల ఏర్పాటును మంగళవారం పరిశీలించిన వారు సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. వెలగవలస, కూనాయవలస గ్రామాల్లో జరుగుతోన్న హద్దురాళ్ల ఏర్పాటుకు సంబంధించి, అవసరమైన సర్వేరాళ్లు వచ్చాయని తెలిపారు. త్వరితగతిన సర్వే చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎం .వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: హద్దురాయిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో జ్యోతీరావు పూలే జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నేతలు, అధికారులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. పూలే గొప్ప సంఘసంస్కర్త అని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో పాటుపడ్డారన్నారు. పురుషులతో సమానంగా మహిళలు కూడా చదువుకోవాలని, తొలుత ఆయన సతీమణి సావిత్రిబాయి పూలేని చదివించి, మహిళల విద్యాభ్యసనకు పునాది వేశారని ప్రశంసించారు. అలాంటి గొప్ప వ్యక్తుల బాటలో యువత నడిచి, మెరుగైన సమాజానికి కృషి చేయాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి



వంగర: ఎంపీడీఓ కార్యాలయంలో జ్యోతీరావు పూలేకి నివాళులర్పిస్తున్న సిబ్బంది



రాజాం సిటీ: సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో కేక్ కట్ చేసి, పూలే జయంతి నిర్వహిస్తున్న దృశ్యం



బాడంగి: గజరాయునివలసలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బొబ్బిలి ఎస్‌బీ ఎస్‌ఐ చిన్నంనాయుడు



రాజాం: పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగులు, తదితరులు



రామభద్రపురం: కొట్టక్కిలో నివాళులర్పిస్తున్న భీమలింగేశ్వర టైలర్స్ అసోసియేషన్ సభ్యులు

తాగునీటి కుళాయి పనులకు భూమిపూజ



కుళాయి పనులకు భూమిపూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత విజయ్‌కుమార్

వంగర:

మండలంలోని కింజంగి గ్రామ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు పనులకు వైఎస్సార్ సీపీ నాయకుడు బెజ్జిపురం విజయ్‌కుమార్ మంగళవారం భూమిపూజ చేశారు. రూ.43 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ పనులకు సంబంధించి, తొలుత బోర్‌వెల్ వేశారు. అనంతరం పైప్‌లైన్ ఏర్పాటు పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ బెజ్జిపురం వెంకటేశ్వరి తెలిపారు.